నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 26 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



### ❖ చదువు విలువ తెలియజేసేందుకే

వసతి గృహాల్లోని పేద విద్యార్థులకు చదువు విలువ తెలియజేసేందుకే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అందుకే మొదట కోటపల్లి ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంచుకున్నాం. మా సీఐ సుధాకర్ ప్రత్యేక చొరవ వల్ల ప్రతిరోజూ సాయంత్రం వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మావంతు కృషి చేస్తున్నాం. సబ్జెక్టుల వారీగా బోధిస్తూ ఎక్కువ మార్కులు తెచ్చుకునేలా ప్రోత్సహిస్తున్నాం. విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు మా పోలీస్ శాఖ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. **- రాజేందర్, ఎస్ఐ, కోటపల్లి**



కోటపల్లి ఎస్సీ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజేందర్

# ఎస్ఐ సార్..

## పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టిన సబ్ ఇన్‌స్పెక్టర్

- ఉత్తీర్ణతే లక్ష్యంగా స్వయంగా పాఠాలు బోధిస్తూ ప్రోత్సాహం
- సొంత ఖర్చులతో స్నాక్స్, స్టడీ మెటీరియల్ అందజేత
- ఆదర్శంగా నిలుస్తున్న రాజేందర్



విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న ఎస్ఐ

కోటపల్లి, ఫిబ్రవరి 25 : విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే కోటపల్లి ఎస్ఐ రాజేందర్ పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టిపెట్టారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి.. కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఆయన నిరుపేద విద్యార్థులకు చేయూతనిస్తున్నారు. 'పది'లో వారి ఉత్తీర్ణతే లక్ష్యంగా తరగతులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**ప్రతి రోజూ తరగతులు...**

కోటపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 20 మంది పదో తరగతి విద్యార్థులుండగా, ఎస్ఐ రాజేందర్ ప్రతి రోజూ వసతి గృహాన్ని సందర్శిస్తూ వారిని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఆయన విధుల్లో ఎంత బిజీగా ఉన్నా ప్రతి రోజూ సాయంత్రం వసతి గృహాన్ని సందర్శిస్తారు. సబ్జెక్టులు బోధించడమేగాక అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. పరీక్షల పట్ల విద్యార్థులకు ఉన్న భయాన్ని తొలగింపజేస్తున్నారు. తన అనుభవాలను చెబుతూ వారు ఉత్సాహంగా పరీక్షలు రాసేలా ప్రోత్సహిస్తున్నారు. తన సొంత ఖర్చులతో విద్యార్థులకు స్నాక్స్ అందించడంతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్ కూడా అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

### ❖ కచ్చితంగా పాసవుతాం



నిరుపేదలమైన మేమంతా పదో తరగతిలో పాస్ కావాలని ఎస్ఐ సార్ ఎంతో చొరవ చూపుతున్నారు. సార్ అందిస్తున్న సూచనలు, సలహాలతో మేమంతా కచ్చితంగా మంచి మార్కులతో పాసవుతాం. ఆయన మాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయం. కష్టపడి చదివి మా తల్లిదండ్రుల పేరు నిలబెడుతాం. **- అజయ్, విద్యార్థి**

### ❖ సార్ ప్రోత్సాహంతో టాప్‌గా నిలుస్త



ప్రతిరోజూ సాయంత్రం ఎస్ఐ సార్ మా హాస్టల్‌కు వస్తున్నారు. సబ్జెక్టుల వారీగా పాఠం చెబుతున్నారు. ఏవైనా అనుమానాలుంటే నివృత్తి చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో చెబుతూ ధైర్యాన్నిస్తున్నారు. సార్ ప్రోత్సాహంతో పదో తరగతి పరీక్షల్లో టాప్‌గా నిలుస్తానన్న నమ్మకముంది.

**- ఓంకార్, విద్యార్థి**

### ❖ తరగతుల నిర్వహణ బాగుంది



ఎస్ఐ సార్ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతుల నిర్వహణ చాలా బాగుంది. మాపై ఎస్ఐ సార్ ఎంతో శ్రద్ధ చూపిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం వచ్చి మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. పరీక్షలంటే ఉన్న భయాన్ని పోగొట్టారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని పదో తరగతిలో ఎక్కువ మార్కులు తెచ్చుకుంట.

**- అజయ్, విద్యార్థి**

## శివపూజకు వేళాయె

- నేడు మహాశివరాత్రి వేడుకలు
- ఊరూరా ముస్తాబైన శైవక్షేత్రాలు
- వేలాదిగా తరలివస్తున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు



చెన్నూర్ రూరల్ : కత్తెరసాలలో ముస్తాబైన మల్లికార్జున స్వామి ఆలయం

మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. వేలాల, బుగ్గ, కత్తెరశాల, వాంకిడి, ఈజ్‌గాం తదితర ఆలయాలు విద్యుత్ దీపాల వెలుగులో కాంతులీనుతున్నాయి. ఆయాచోట్ల అంగరంగ వైభవంగా జరిగే శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలివస్తుండగా, కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఉపవాస దీక్షలతో రాత్రంతా జాగరణ చేసి స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు.

# సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదం

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి రేవంతే
- కాంగ్రెస్, బీజేపీల మధ్య లోపాయికార ఒప్పందం
- ఆ రెండు పార్టీల అభ్యర్థులను ఓడించాలి
- ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే సీఎం కుర్చీ మారడం ఖాయం
- శ్మశానవాటిక పేరిట కోట్లుదండుకుంటున్న ఎమ్మెల్యే పీఎస్సార్
- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 25 : మంచిర్యాలలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని, అసలు తమ అభ్యర్థికి ఎందుకు ఓటు వేయాలో వివరించాల్సింది పోయి, బీఆర్ఎస్ అభ్యర్థిని ఎందుకు పెట్టలేదని విమర్శించడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు ఎద్దేవా చేశారు. మంగళవారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి మంచిర్యాలకు వచ్చి కాంగ్రెస్ అభ్యర్థికి ఎందుకు ఓటేయాలన్న అంశంపై మాట్లాడకుండా పోటీలో లేని బీఆర్ఎస్ పార్టీని తిట్టడం ఏమిటని ప్రశ్నించారు. మరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి కాంగ్రెస్ ఎందుకు అభ్యర్థిని నిలపలేదన్నారు. టీచర్ ఎమ్మెల్సీ మీకు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ మాకు అన్న అగ్రిమెంట్‌తో కాంగ్రెస్, బీజేపీలు లోపాయికార ఒప్పందం చేసుకున్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు బీఆర్ఎస్ గ్రాడ్యుయేట్లు ఓటువేయవద్దని కోరారు. తటస్థంగా ఉన్న వారిలో మంచి వారిని ఎంపిక చేసుకొని వారికి ఓటువేయాలని, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కోటాలో ఎవరూ ఓటు వేయకుండా బహిష్కరించారని, వారు ఓటు గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఓడినా, గెలిచినా తనకేంకాదని సీఎం చెబుతున్నాడని, గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం ఉన్నఫలంగా మూడుచోట్ల సభలు పెట్టి ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతున్నాడన్న సమాచారం ఉన్నందునే ఈ సభలు నిర్వహించారని తెలిపారు. ఈ ప్రభుత్వం కేవలం ఐదుగురు ఎమ్మెల్యేలతోనే నడుస్తున్నదని, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే స్వయంగా ఈ విషయాన్ని చెబుతున్నారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే సీఎం కుర్చీ మారడం ఖాయమని అన్నారు. ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. దేశం మొత్తంలో నాలుగువేల పైచిలుకు ఎమ్మెల్యేలు ఉంటే.. అందులో ఎవ్వరిపైనా రానన్ని ఫిర్యాదులు ఇక్కడి ఎమ్మెల్యే పీఎస్సార్‌పై వచ్చాయని, సీఎంకు, డిప్యూటీ సీఎంకు, టీపీసీసీ అధ్యక్షుడికి పీఎస్సార్ బాధితులు పిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆయన వల్ల రౌడీయిజం, గూండాయిజం పెరిగిపోయిందని ఆరోపించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఉంటే మంచిర్యాలలో మాత్రం వద్దంటున్నారని, సగం పూర్తయిన భవనాన్ని కూల్చివేశారని చెప్పుకొచ్చారు. దాంతోపాటే ఆర్అండ్‌బీ ఆఫీస్, గెస్ట్‌హౌస్, క్వార్టర్లు కూల్చేశారని, మార్కెట్‌లో వెయ్యిషాపులు కూలగొట్టానని స్వయంగా ఎమ్మెల్యేనే చెబుతున్నారని, కేవలం వన్‌వే పెడితే సరిపోయే దానికి షాపులను కూల్చారన్నారు. పైగా సీఎంనే స్ఫూర్తిగా తీసుకున్నానని గొప్పగా చెప్పుకోవడం దారుణమని, 80 ఏళ్లకింద కట్టిన ఎండోమెంట్ షాపులను కూడా కూల్చడం ఏమిటని ప్రశ్నించారు. సీఎం వచ్చినందున ట్రాఫిక్ సమస్యలుంటాయని చెప్పి పాఠశాలలను బంద్‌పెట్టించారన్నారు. టీచర్లందరినీ సభకు తరలించి ఓట్లు అడగడం దారుణమని మండిపడ్డారు.

**శ్మశానవాటిక పేరిట కోట్లుదండుకుంటున్న ఎమ్మెల్యే పీఎస్సార్**

స్థానిక ఎమ్మెల్యే పీఎస్సార్ శ్మశానం నిర్మాణం పేరిట కోట్లు దండుకుంటున్నాడని మాజీఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు విజిత్‌రావు ఆరోపించారు. నాలుగున్నర కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పి ఇప్పుడు రూ. 11 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నారని, ఇంతపెద్ద మొత్తంలో అంచనాలు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. శ్మశాన వాటికకోసం వాడిన మట్టి, ఇసుక గోదావరి నది నుంచి అక్రమంగా తీసుకువచ్చిందేనని, దీని బిల్లులు కూడా స్వాహా చేస్తారని, దొంగలెక్కలు చూపించి పెద్ద ఎత్తున నిధులు కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అసలు శ్మశాన వాటిక కడుతున్న ప్రదేశమే సరైనది కాదని, తాము శ్మశాన వాటిక నిర్మాణానికి వ్యతిరేకం కాదని, కానీ ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని కట్టాల్సిందని అన్నారు. ఇప్పుడు శ్మశాన వాటిక నిర్మిస్తున్న ప్రదేశానికి దగ్గరలో పలు ఆలయాలు ఉన్నాయని, పండుగలు, పుణ్యస్నానాల కోసం నిత్యం ప్రజలు దీనిముందునుంచే వెళ్లాల్సి ఉంటుందని, దీని వెనకాల ఉన్న ఎంసీహెచ్‌లో పుట్టిన పిల్లలను ఇంటికి తీసుకువెళ్లాలంటే ముందుగా దీని ముందునుంచే తీసుకు వెళ్లాల్సి రావడం దురదృష్టకరమని అన్నారు.

**అంతర్గాం బ్రిడ్జి నిర్మించి తీరుతాం**

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మంచిర్యాల-అంతర్గాం మధ్య గోదావరి నదిపై బ్రిడ్జిని నిర్మించి తీరుతామని దివాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడ వంతెన నిర్మించడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని, దూరభారం తగ్గుతుందని అన్నారు. మంచిర్యాలలో వందేభారత్ రైలును ఆపలేని బీజేపీ నాయకులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగు హక్కులేదని అన్నారు. మంచిర్యాలలో అధికారులు ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కుతున్నారని, ఎక్కడ చూసినా ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయని, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గాదెసత్యం, బేర సత్యనారాయణ, అంకం నరేశ్, తోట తిరుపతి, శ్రీరాముల మల్లేశ్, తాజుద్దీన్, సాగి వెంకటేశ్వరరావు, మధూకర్ పాల్గొన్నారు.

## వామ్మో పులి!

జైపూర్, ఫిబ్రవరి 25 : మండలంలోని కుందారం అటవీ ప్రాంతంలో పులి సంచరించిన ఆనవాళ్లుండగా, సమీప గ్రామాల ప్రజలు భయపడిపోతున్నారు. సోమవారం నీలగిరి ప్లాంటేషన్ ప్రాంతంలో పులి పాదముద్రలు ఉన్నట్లు పేర్కొన్న అటవీ అధికారులు, మంగళవారం మాత్రం ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. కాగా, గ్రామానికి చెందిన వాట్సప్ గ్రూపుల్లో పత్తి చేనుల్లో పులి అడుగులున్నాయంటూ చెక్కర్లు కొట్టడంతో స్థానికులు మరింత ఆందోళన చెందుతున్నారు. వేలాల జాతర ఉండడంతో అలికిడికి శివ్వారం వైపు వెళ్లిపోయి ఉంటుందని అటవీ అధికారులు తెలిపారు.

## సీసీఐ కొనుగోళ్లపై సీబీఐ విచారణ జరిపించాలి

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కౌటాల, ఫిబ్రవరి 25 : సీసీఐ పత్తి కొనుగోళ్లపై సీబీఐ విచారణ జరిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సిర్పూర్(టీ) జిన్నింగ్ మిల్లు వద్ద పత్తి రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. సాంకేతిక లోపాల పేరుతో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేయడం వల్ల రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తూ తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ఎమ్మెల్యే రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వచ్చే నెల 15వ తేదీ వరకూ పత్తి కొనుగోళ్లు చేపట్టాలని, లేదంటే జాతీయ రహదారులను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కేసీఆర్ సర్కారు ఉంటే ఇప్పటికీ రెండు విడుతలుగా రైతుబంధు అందేదని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు రైతు భరోసారాలేదన్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కడెం ప్రధాన కాలువలో నినాదాలు చేస్తున్న రైతులు

**తాళ్లపేట, మాకులపేట రైతుల డిమాండ్**

- 24వ డిస్ట్రిబ్యూటరీ వద్ద ఆందోళన

# చివరి ఆయకట్టుకూ నీరందించాలి

దండేపల్లి, ఫిబ్రవరి 25 : చివరి ఆయకట్టు వరకూ సాగు నీరందించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దండేపల్లి మండలం తాళ్లపేట సమీపంలోని 24 డిస్ట్రిబ్యూటరీ వద్ద తాళ్లపేట, మాకులపేట గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. కడెం ప్రధాన కాలువలోకి దిగి మోకాలి లోతు వరకు కూడా సరిగా సాగు నీరందడం లేదని చూపించారు. పంటల ప్రారంభానికి ముందు సరిపడా నీళ్లిస్తామన్నా అధికారులు.. తీరా పంటలు వేసుకున్నాక చేతులెత్తేశారని మండిపడ్డారు. పంట ప్రారంభం నుంచి ఎనిమిది తడులు నీరందిస్తామన్నారని, ఇప్పటి వరకు 4 తడులే అందించారని, వాటిలో 2 తడులు మాత్రమే సరిగ్గా అందించారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీరందక వరి, మక్క పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడెం ప్రధాన కాలువ సమీపంలో ఉన్న తమ పరిస్థితే ఇలా ఉంటే.. మిగతా రైతుల దుస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. బావుల్లో కూడా నీరు ఇంకిపోతుందని, ఇలాగైతే పంటలెలా చేతికొస్తాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈఈ శ్రావణ్ అక్కడికి వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### ❖ పెట్టుబడి కూడా పోయేటట్టే ఉంది



*యాసంగిల 4 ఎకరాల్లో వరి, 2 ఎకరాల్లో మక్క వేసిన. కడెం నుంచి నీళ్లు సక్రమంగా రావడం లేదు. బావుల్లో నీళ్లు ఇంకిపోతున్నయ్. పెట్టుబడి కూడా పోయేటట్టే ఉంది. కనీసం ఎకరం పొలం కూడా పండుతదన్న ఆశ లేదు. మిగతా నాలుగు తడులు సక్రమంగా ఇస్తేనే పంటలు దక్కుతాయి.*

**- సిందం సత్తయ్య, రైతు, తాళ్లపేట**

### ❖ సక్రమంగా నీళ్లివ్వాలే



*యాసంగిల 3 ఎకరాల్లో వరి, ఎకరంన్నరలో మక్క వేసిన. ముందేమో నీళ్లిస్తమని సార్లు చెప్పిన్రు. ఇప్పుడేమో నామమాత్రంగా ఇస్తున్నరు. పంట మొదట్లనే ఇట్లా ఉంటే ఎట్లా. గిట్లయితే పంట చేతికొస్తదన్న నమ్మకం లేదు. ఇప్పటికైనా సర్కారు, అధికారులు రైతుల గురించి ఆలోచించాలే. సక్రమంగా నీళ్లివ్వాలే.*

**- జెల్లపెల్లి శ్రీనివాస్, రైతు, గొల్లగూడెం**



మాకులపేట సమీపంలో ఎండిపోతున్న మక్క

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి

- జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి డిమాండ్
- మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో అర్ధ నగ్న ప్రదర్శన



నిరసనలో పాల్గొన్న బీసీ నాయకులు

మంచిర్యాల (ఏసీసీ), ఫిబ్రవరి 6 : కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని ఐబీ చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహం దగ్గర అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఆర్థిక పరమైన రిజర్వేషన్లు చెల్లవని, 1993లో ఇంద్రసహానీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం 2019లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 103ను సవరించి ఈడబ్ల్యూఎస్ పేరుతో అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం దారుణమని మండిపడ్డారు. ఈ విధానంతో బీసీలకు తీవ్ర అన్యాయం చేయడమే అవుతుందని, దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 14 శాతం మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలు తొమ్మిది శాతం మాత్రమే ఉన్నారని, ఇది వివక్ష కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర బీసీ సంఘాల ఐక్య వేదిక, తెలంగాణ ఉద్యమ నాయకులు గజెల్లి వెంకటయ్య, జిల్లా కార్యదర్శి శాఖ పురి భీమ్‌సేన్, నాయకులు శ్రీపతి రాములు, చంద్రగిరి చంద్రమౌళి, కీర్తి భిక్షపతి, బండ సతీశ్, అంకం సతీశ్, షేక్ సల్మాన్, ఆరెందుల రాజేశం, బోడంకి కుమార్ పాల్గొన్నారు.



## మద్యం షాపులు బంద్

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 25: పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు బంద్ చేస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25 సాయంత్రం 4 నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు మద్యం అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.